# ధాన్యాగారంగా పాలమూరు

- **18,71,196 టన్నుల వరి దిగుబడి**
- **రూ.561.35 కోట్ల ధాన్యం అమ్మకాలు**
- **గిట్టుబాటు ధర వస్తుండటంతో రైతుల ఆనందం**



మహబూబ్‌నగర్ జిల్లాలో రైతుల నుంచి కొన్న ధాన్యాన్ని లారీలోకి ఎక్కిస్తున్న కూలీలు

మహబూబ్‌నగర్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రైతులు విరివిగా వరి ధాన్యాన్ని పండిస్తుండటంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ధాన్యాగారంగా మారింది. వరి పండించే రైతుల సంఖ్య ఏటా పెరుగుతూనే ఉన్నది. ప్రత్యామ్నాయ పంటలు వేయాలని, లాభదాయకమైన పంటలు సాగు చేయాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నా రైతులు వరి వైపే మొగ్గుచూపుతున్నారు. ఈ ఏడాది వానకాలం సీజన్‌లో వర్షాభావ పరిస్థితులు వెంటాడాయి. వర్షాలు ఆలస్యంగా పడినప్పటికీ రైతులు తమ బోరుబావుల నుంచి పంటలకు సాగునీరు అందించి కాపాడారు. ఒక దశలో పంటలు ఎండిపోతాయని ఆందోళన చెందినా.. వరుణుడు కరుణించడంతో రైతుల ఆశలు చిగురించాయి. ఎక్కడా ఎకరం ఎండకుండా వరికి పుష్కలంగా సాగునీరందింది. ఎగువన కురిసిన వర్షాలకు కృష్ణానది ఉప్పొంగడంతో జూరాల ఎగువ, దిగువ ప్రాంతాల్లోని ప్రాజెక్టులకు సాగునీరు విడుదల చేసి గత ప్రభుత్వం రైతులకు మద్దతుగా నిలిచింది.

**7,73,096 ఎకరాల్లో వరి సాగు..**

వ్యవసాయ అధికారుల అంచనా ప్రకారం ఈ వానకాలంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 7,73,096 ఎకరాల్లో వరి పండించారు. సుమారు 18,71,196 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చినట్టు అంచనా. దీంతో మహబూబ్‌నగర్ జిల్లాలో 1.90 లక్షల ఎకరాలు, నారాయణపేటలో 1.60 లక్షలు, వనపర్తిలో 1,87,544 ఎకరాలు, జోగులాంబ గద్వాల జిల్లాలో 80 వేల ఎకరాలు, నాగర్‌కర్నూల్ జిల్లాలో 1,55,552 ఎకరాల్లో వరి సాగైంది. భీమా, కోయిల్‌సాగర్, కల్వకుర్తి, నెట్టెంపాడు, జూరాల కుడి, ఎడమ కాల్వల కింద వరి సాగు చేశారు. దీంతో మహబూబ్‌నగర్ జిల్లాలో 3.90 లక్షల మెట్రిక్ టన్నులు, నారాయణపేట జిల్లాలో 3.84 లక్షలు, వనపర్తి జిల్లాలో 5,10,539, జోగులాంబ గద్వాల జిల్లాలో 1.20 లక్షలు, నాగర్‌కర్నూల్ జిల్లాలో 4,66,657 టన్నుల ధాన్యం పండినట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలో ఎటుచూసినా వరి ధాన్యం కుప్పలే కనిపిస్తున్నాయి. రోడ్ల వెంట ఖాళీ స్థలాల్లో రైతులు ధాన్యాన్ని ఆరబెడుతూ అక్కడికక్కడే వ్యాపారులకు అమ్ముతున్నారు.

## ఏబీవీపీ అధ్యక్ష కార్యదర్శులుగా జానారెడ్డి, ఝాన్సీ

హైదరాబాద్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ) : ఏబీవీపీ తెలంగాణ 42వ రాష్ట్ర మహాసభల్లో రెండవసారి రాష్ట్ర అధ్యక్షులుగా డాక్టర్ నక్కల జానారెడ్డి, రాష్ట్ర కార్యదర్శిగా చింతకాయల ఝాన్సీ ఎన్నికయ్యారు. ఈ నెల 7 నుంచి 10వ తేదీల్లో 69వ జాతీయ మహాసభలు ఢిల్లీలో జరుగుతుండగా.. వాటిల్లో భాగంగా 42వ రాష్ట్ర మహాసభలు నిర్వహించారు. ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన జానారెడ్డిది నల్గొండ జిల్లా పెద్దవూర మండలం రామన్నగూడెం కాగా.. కార్యదర్శిగా ఎన్నికైన ఝాన్సీది నల్గొండ జిల్లా అనుముల మండలం శ్రీనాథపురం. వీరిద్దరూ విద్యారంగ, నిరుద్యోగ సమస్యలపై పోరాడుతున్నారు.



రాజ్‌భవన్‌లో గవర్నర్‌కు వేడుకల ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆటా ప్రతినిధులు

## ఆటా వేడుకలకు గవర్నర్‌కు ఆహ్వానం

హైదరాబాద్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): త్వరలో జరగనున్న అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా) వేడుకలకు గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్‌కు ఆహ్వానం అందింది. శనివారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన ఆటా ప్రతినిధులు వేడులకు హాజరుకావాలని కోరారు. ఆటా అధ్యక్షుడు జయంత్ చల్లా, సీఐఐ తెలంగాణ అధ్యక్షుడు సీ శేఖర్‌రెడ్డి, ఆటా బిజినెస్ విభాగం చైర్మన్ లాక్స్ చేపూరి ఆహ్వానపత్రికను ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్ బిజినెస్ సెమినార్‌కు గవర్నర్ హాజరయ్యేందుకు అంగీకరించినట్టు ప్రతినిధులు తెలిపారు.

## తొలిసారి ఆల్కాహాల్ ఎలర్జీ టెస్ట్

- **కొంతమందిలో ఆల్కాహాల్ ఎలర్జీ**
- **కచ్చితత్వంతో గుర్తించే పరీక్షలు**
- **రుగ్మతల తీవ్రతను బట్టి చికిత్స చేస్తున్న డాక్టర్ వ్యాకరణం నాగేశ్వర్**



హైదరాబాద్, డిసెంబర్ 9: దేశంలోనే తొలిసారి ఆల్కాహాల్ చాలెంజింగ్ ఎలర్జీ టెస్ట్, లిక్కర్ స్కిన్ టెస్ట్ నిర్వహించారు ప్రముఖ వైద్యుడు డాక్టర్ వ్యాకరణం నాగేశ్వర్. మద్యం తాగినప్పుడల్లా చర్మంపై దద్దుర్లు, శ్వాస ఇబ్బందులు తదితర లక్షణాలతో బాధపడుతున్న ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ (50)కు హైదరాబాద్‌లోని తన అశ్విని ఎలర్జీ సెంటర్‌లో ఈ పరీక్షలు నిర్వహించి రోగిని కాపాడారు. ఉదయ్‌పూర్‌కు చెందిన బాధితుడికి మద్యం సేవించే అలవాటు ఉన్నదని, అయితే ఆల్కాహాల్ తాగినప్పుడల్లా చర్మవ్యాధులకు గురయ్యేవాడని, ఆస్తమా బారినపడ్డారని డాక్టర్ వ్యాకరణం నాగేశ్వర్ తెలిపారు. ఢిల్లీలోని ప్రముఖ దవాఖానల్లో చికిత్స ఇప్పించి, ఆల్కాహాల్ డీ అడిక్షన్ ఇప్పించినా ఫలితం లేకపోయిందని వెల్లడించారు. చివరికి అతడిని తన వద్దకు తీసుకురాగా, వివిధ రకాల చర్మ పరీక్షలు నిర్వహించి సీరం ఐజీఈ ఎలర్జీ తీవ్రంగా ఉన్నట్టు గుర్తించానని వివరించారు. మద్యం అలవాటు ఉన్నందున అతడికి అత్యంత కీలకమైన 3 రకాల ఆల్కాహాల్ ఎలర్జీ టెస్టులు నిర్వహించామని తెలిపారు. 30 ఎంఎల్ లిక్కర్ తాగించి గంటసేపు పరీక్షించగా, బాధితుడిలో పలు చర్మవ్యాధుల లక్షణాలు కనిపించాయని చెప్పారు. దాంతో అత్యవసర చికిత్స అందించి ఎలర్జీని నియంత్రించామని వివరించారు. ఇలా ఒక బాధితుడికి ఆల్కాహాల్ ఎలర్జీ సంబంధిత పరీక్షలు నిర్వహించటం దేశంలోనే తొలిసారి అని ఆయన పేర్కొన్నారు.

## గ్రేటర్ హైదరాబాద్‌ను వణికిస్తున్న చలి

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబరు 9 (నమస్తే తెలంగాణ): ఉష్ణోగ్రతలు సాధారణస్థాయి కంటే దిగువకు పడిపోవడంతో గ్రేటర్ హైదరాబాద్‌లో చలి తీవ్రత పెరుగుతున్నది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో 30.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత, 17.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గాలిలో తేమ 43శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

## పశుసంవర్ధకశాఖలో ఫైళ్ల గల్లంతుపై వివాదం

- **మాజీ ఓఎస్డీ సహా ఐదుగురు సిబ్బందిపై కేసు**
- **ఆరోపణలు అవాస్తవం: మాజీ ఓఎస్డీ కల్యాణ్‌కుమార్**



పశుసంవర్ధకశాఖ ప్రధాన కార్యాలయంలో చిందరవందరగా పడి ఉన్న ఫైళ్లు

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబరు 9 (నమస్తే తెలంగాణ): పశుసంవర్ధకశాఖ ప్రధాన కార్యాలయంలో ఫైళ్లు గల్లంతు ఘటన కలకలం రేపుతున్నది. కార్యాలయంలోని కీలక ఫైళ్లు మాయమైనట్టు కార్యాలయ వాచ్‌మన్ లక్ష్మయ్య ఫిర్యాదుతో మాజీ ఓఎస్డీ కల్యాణ్‌కుమార్‌తోపాటు నలుగురు సిబ్బందిపై పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. తనపై వస్తున్న ఆరోపణపై కల్యాణ్‌కుమార్ స్పందించారు. అవి పూర్తిగా నిరాధారమని, దీనిపై ఎలాంటి విచారణకైనా తాను సిద్ధమని పేర్కొన్నారు. సెంట్రల్‌జోన్ డీసీపీ, నాంపల్లి ఇన్‌స్పెక్టర్ల కథనం ప్రకారం.. ఈనెల 8న రాత్రి 7 గంటల సమయంలో కార్యాలయ వాచ్‌మన్ లక్ష్మయ్య విధుల్లో భాగంగా గదులు తనిఖీ చేస్తుండగా మాజీ ఓఎస్డీ కల్యాణ్‌కుమార్ గది తాళాలు తెరిచి ఉండడం చూసి అనుమానించారు. లోపలికి వెళ్లి చూడగా ఫైళ్లు చిందరవందరగా కనిపించాయి. దీంతో ఆయన ఆరా తీయగా సాయంత్రం ఐదున్నర గంటల సమయంలో కల్యాణ్‌కుమార్, కంప్యూటర్ ఆపరేటర్ మోహన్, ఎలిజా, అటెండర్లు వెంకటేశ్, ప్రశాంత్ వచ్చి ముఖ్యమైన డాక్యుమెంట్లు తీసుకెళ్లినట్టు తెలిసింది. వెంటనే ఆయన నాంపల్లి పోలీసులు, డీసీపీకి ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆధారాలు సేకరించారు. నిందితులపై 409, 427, 448, 477, 109 రెడ్‌విత్ 34ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు నాంపల్లి ఎస్ఐ జానయ్య తెలిపారు.

**ఫైల్స్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వద్దే ఉంటాయి: మాజీ ఓఎస్డీ**

పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో ఫైల్స్ మాయమైనట్టు వస్తున్న వార్తలు పూర్తిగా నిరాధారమని మాజీ ఓఎస్డీ కల్యాణ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాసాబ్‌ట్యాంక్‌లోని పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్న అప్పటి మంత్రి తలసాని కార్యాలయాన్ని నూతన సచివాలయంలోని రెండో అంతస్తులోకి తరలించినట్టు తెలిపారు. మంత్రి ఆమోదం కోసం వచ్చిన ఫైల్స్‌ను నిర్దిష్ట విధానంలో ఎప్పటికప్పుడు పశుసంవర్ధకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కార్యాలయంలో అందజేసినట్టు వివరించారు. ప్రభుత్వ మార్పిడి నేపథ్యంలో ఫర్నిచర్, ఇతర సామాగ్రిని జీఏడీకి అప్పగించే ప్రక్రియలో భాగంగానే మాసాబ్ ట్యాంక్ కార్యాలయానికి తాను, తమ కార్యాలయ సిబ్బంది వెళ్లామని వివరించారు. శాఖాపరమైన ఫైల్స్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, డైరెక్టర్ కార్యాలయంలోనే ఉంటాయని తెలిపారు.





పోలీసులకు పట్టుబడిన నిందితుడు నకిలీ ప్రొటోకాల్ అడ్వైజర్ బుసి ప్రవీణ్ సాయి, పోలీసులు స్వాధీనం చేసుకున్న గుర్తింపు కార్డు, ప్రభుత్వ స్టిక్కర్లు, ఇన్నోవా కారు

## సీఎం ప్రొటోకాల్ అడ్వైజర్‌నంటూ మోసం

- **నిందితుడు బుసి ప్రవీణ్ సాయిని అరెస్టు చేసిన పోలీసులు**
- **ఇన్నోవా కారు, గుర్తింపు కార్డు, స్టిక్కర్లు, ల్యాప్‌టాప్ స్వాధీనం**
- **నిందితుడిపై ఇప్పటికే పలు కేసులు**

హయత్‌నగర్, డిసెంబర్ 9: ముఖ్యమంత్రి కార్యాలయ (సీఎంవో) ప్రొటోకాల్ అడ్వైజర్ ఆఫీసర్‌నంటూ నమ్మించి మోసానికి పాల్పడిన ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఏపీలోని తణుకు మండలం, అత్తిలి గ్రామానికి చెందిన బుసి ప్రవీణ్ సాయి (23) అనే ఆ వ్యక్తి నుంచి నకిలీ నంబర్ ప్లేట్ కలిగిన ఇన్నోవా క్రిస్టా కారుతోపాటు వెహికల్ సైరన్ సెట్, రెండు సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్, గుర్తింపు కార్డు, ప్రభుత్వ చిహ్నాలతో కూడిన నకిలీ స్టిక్కర్లు, హోం మంత్రి లెటర్ ప్యాడ్స్ స్వాధీనం చేసుకున్నట్టు ఏసీపీ భీమ్‌రెడ్డి వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. నిందితుడు అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, గండిమైసమ్మ ఆలయ సమీపంలో ప్రభుత్వ స్థలాన్ని తక్కువ ధరలో రూ.25 లక్షలకు ఇప్పిస్తానంటూ బేగంపేట పెరల్ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న మల్లంపల్లి వీరభద్రరావు నుంచి రూ.8.10 లక్షలు అడ్వాన్సుగా తీసుకున్నాడు. ఆ తర్వాత వీరభద్రరావు ఆ స్థలాన్ని సందర్శించగా.. అక్కడ నిర్మాణం జరుగుతున్నట్టు నోటీసు కనిపించింది. ఆ చుట్టుపక్కల వారిని వాకబు చేయగా అది ప్రైవేట్ భూమి అని చెప్పారు. దీంతో ఆయన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. పెద్దఅంబర్‌పేటలోని ఓఆర్ఆర్ సమీపంలో ప్రవీణ్ సాయిని అరెస్టు చేసి విచారించడంతో నేరాన్ని అంగీకరించాడు. అతనిపై ఇప్పటికే కూకట్‌పల్లి, సైఫాబాద్, ఏసీబీ హైదరాబాద్, బేగంపేట్, అంబర్‌పేట్ పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు కేసులు నమోదైనట్టు ఏసీపీ భీమ్‌రెడ్డి తెలిపారు.


